మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# క్రీడలతో ఆత్మవిశ్వాసం

**జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్ఎస్ చౌహాన్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త:** క్రీడలు మనోబలాన్ని పెంచడమే కాకుండా, దృఢమైన ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తాయని జోగులాంబ జోన్ 7 డిఐజిఎల్ ఎస్ చౌహాన్ అన్నారు. 3వ తెలంగాణ పోలీసు గేమ్స్, స్పోర్ట్స్ మీట్ 202425 కి ఎంపికైన జోగులాంబ జోన్7 జోనల్ టీమ్ క్రీడాకారులకు ఎస్పీ జానకి ధరావత్ తో కలిసి ట్రాక్ సూట్లు,షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంలో,అలాగే వారి శారీరక దృఢత్వాన్ని మెరుగుపరచడంలో ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. పోలీసు అధికారుల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపరచడం కోసం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన దశగా పేర్కొన్నారు. 20 ఈవెంట్లలో సెలెక్ట్ అయిన 87 మంది పోటీదారులు వివిధ క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో తమ జోన్‌కు గౌరవాన్ని తీసుకురావడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమం క్రీడల ప్రాముఖ్యతను చూపించేలా, స్నేహభావం, క్రీడాస్ఫూర్తి, దృఢ సంకల్పం విలువలను పోలీస్ విభాగంలో ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకీ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ట్రాక్ సూట్ అందజేస్తున్న డి ఐ జి, ఎస్ పి

# కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

**నారాయణపేట టౌన్, జనవరి 28 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నారాయణపేట జిల్లా వైద్యాధికారి డిఎంహెచ్ సౌభాగ్య లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజలను ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేటట్లు చూడాలని సూచించారు. అనంతరం ఒపి దగ్గర క్యూలో రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో ఏవైనా మందుల సమస్యలున్న పై అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. ప్రతిభ, భారతి, ఫార్మసిస్ట్ వెంకటేష్, స్టాఫ్ నర్స్ పరమేశ్వరి, డీఈవో రాజేష్ తదితరులు ఉన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఓ

# డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ కళాశాలలో జాబ్ మేళా

**జడ్చర్ల,జనవరి 28 ప్రభాతవార్త:** శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ సహకారంతో డా. బిఆర్ఆర్ ప్రభుత్వ కలశాల (తి) జడ్చర్ల లో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 31న శుక్రవారం 11 గం.లకు కళాశాలలోని సెమినార్ హాల్ లో ఫాక్స్కాన్ కంపెనీలో 500 ఉద్యోగాల కొరకు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. పదవ తరగతి కనీస విద్యార్హత కలిగివుండి, 18 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయస్సు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి సర్టిఫికెట్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ , రెండు సెట్స్ జిరాక్స్ రెండు పాస్ ఫోటోలు తీసుకొని రాగలరని కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య తెలిపారు.

## నేడు శ్రీ కురుమూర్తి
# క్షేత్రగిరి ప్రదక్షిణ

**చిన్నచింతకుంట ,జనవరి 28 ప్రభాతవార్త:** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలువబడుతూ, పేదలు తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ కురుమూర్తి క్షేత్ర గిరి ప్రదక్షణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తజనం అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నేతలు తెలిపారు.



శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం

## సైబర్ వల.. సామాన్యుడు
# విలవిల

- పెరుగుతున్న సైబర్ మోసాలు
- టెక్నాలజీ సాయంతో నేరాలు
- మరో వైపు లోన్ యాప్‌ల వేధింపులు
- మనీ సర్క్యులేషన్,పిరమిడ్ స్కీంలు
- గతేడాదితో పోలీస్తే 15.6శాతం పెరిగిన సైబర్ క్రైం
- 2024లో రూ.55లక్షల రికవరీ



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28, ప్రభావార్త:** సైబర్ నేరాల కేసులు నిత్యం పెరుగుతూనే ఉన్నాయి. నేరగాళ్లు తమ దారులను మార్చుకుంటూ కొత్త పోకడలతో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాళ్లను విసురుతున్నారు. ఈక్రమంలో గత ఏడాదిలో పోలీస్తే 2024లో 15.6శాతం సైబర్ కేసులు పెరిగినట్లు వార్షిక నివేదిక ఆధారంగా తెలుస్తున్నది. అయితే 2024లో 210 సైబర్ కేసులకు సంబంధించి రూ.55లక్షల డబ్బును రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యాలయాలు, కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

సైబర్ నేరాల వల్ల దేశంలో గత ఏడాదిలో సుమారు 12లక్షల సైబర్ ఫిర్యాదులు రాగా సుమారుగా రూ.లక్ష కోట్లకు పైగా నష్టపోయారని సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సంస్థల తెలిపింది. 2023లో ప్రతి లక్ష జనాభాకు సుమారు 130 సైబర్ నేరాలు జరిగాయని వెల్లడించింది. దీన్నిబట్టి చేస్తూ భవిష్యత్తులో ఎంత తీవ్రంగా సైబర్ నేరాలు జరగనున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

### ఇవీ సైబర్ మోసాలు..

మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం), పిరమిడ్ స్కీమ్స్, మరియు మనీ సర్క్యులేషన్ మోసాల పై అవగాహన కలిగి ఉండాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం), పిరమిడ్ స్కీమ్స్, మనీ సర్క్యులేషన్ మోసాలు సైబర్ క్రైమ్ ఆర్థిక నేరాల్లో ప్రధాన భాగంగా ఉన్నాయి. వీటిని నియంత్రించేందుకు ప్రజలకు అవగాహన కలిగించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ప్రాథమిక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు తెలియజేయాల్సిన కీలక అంశాలు

### మల్టీ లెవల్ మార్కెటింగ్..

మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం), ఇది ఒక మార్కెటింగ్ విధానం. ఇక్కడ ఉత్పత్తులు లేదా సేవలను నేరుగా కొనుగోలు చేసి వాటిని మరింత మంది వినియోగదారులకు పంపిణీ చేయడం ద్వారా ఆదాయాన్ని అందిస్తుంది. కానీ ఇది చట్టపరంగా ఉండేందుకు వ్యాపారానికి బలమైన పునాది ఉండాలి. కేవలం సభ్యులను రిజిస్టర్ చేయించడం ద్వారా డబ్బులు సంపాదించే స్కీమ్స్ ఇవి.

- నకిలీ ఉత్పత్తులు లేదా అసలు ఉత్పత్తులే లేని పరిస్థితులు.
- ప్రారంభంలో చెల్లింపులు చేసుకుని తర్వాత లాభాలు ఆశపెట్టడం.
- భారీ ఆదాయ వాగ్దానాలు (గంటల్లో లక్షలు సంపాదించవచ్చని చెప్పడం).
- భాగస్వాముల ద్వారా మాత్రమే లాభాలు పొందగల స్కీమ్స్.

### పిరమిడ్ స్కీమ్..

ఇది ఒక వ్యాపార నమూనా. ఇక్కడ నూతన సభ్యుల ద్వారా వచ్చిన పెట్టుబడులను పాత సభ్యులకు లాభంగా చెల్లిస్తారు. దీంట్లో అసలు ఉత్పత్తులు లేకపోవడం, కేవలం సభ్యులను చేరడం ముఖ్య లక్ష్యంగా ఉంటుంది. ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ బానింగ్ యాక్ట్ 1978 ప్రకారం, పిరమిడ్ స్కీమ్స్ అనేవి చట్టవిరుద్ధం. వీటిని ప్రోత్సహించడం కూడా నేరం. ప్రారంభంలో పాత సభ్యులకు పెద్ద లాభాలు ఇవ్వడం ద్వారా నమ్మకం కలిగిస్తారు. ఇలా కొంతకాలం సాఫీగా సాగుతుంది. కొత్తగా సభ్యులు చేరని సమయంలో స్కీమ్ పూర్తిగా కూలిపోవడం జరుగుతుంది.

### మనీ సర్క్యులేషన్ మోసాలు..

ఇది కేవలం డబ్బును ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి బదిలీ చేయించడం ద్వారా నడిచే స్కీమ్. ఇక్కడ ఎటువంటి ఉత్పత్తులు లేదా సేవలు ఉండవు. పైపైన బాగా లాభదాయకంగా కనిపించడం. చట్టపరమైన పత్రాలు లేకపోవడం. ప్రాజెక్ట్ పూర్తి కాకముందే మూతపడే అవకాశాలు ఎక్కువ.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..**

- అధిక లాభాల వాగ్దానాలకు భ్రమ పడవద్దు.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు అందిస్తామనే హామీలను నమ్మవద్దు.
- ఒక వ్యక్తి మీకు ఎలాంటి బలమైన ఆధారాలు చూపించకపోతే,వెంటనే అప్రమత్తం కావాలి.
- న్యాయపరమైన సమాచారం పొందాలి.

**ఏదైనా స్కీమ్‌లో భాగస్వామి అయ్యే ముందు ఆ కంపెనీ న్యాయబద్ధతను తెలుసుకోవాలి.**

- సంబంధిత లైసెన్సులు మరియు రిజిస్ట్రేషన్లు పరిశీలించాలి.
- మీకు ఎవరైనా ప్రెజెంటేషన్ ద్వారా అసాధారణ లాభాలు చూపిస్తే, ఆ స్కీమ్‌కి దూరంగా ఉండండి.
- ఇటీవల పండుగల సందర్భంగా లింక్‌లు పంపించి వాటిని ఓపెన్‌చేయగానే మన డేటాను మొత్తం తీసుకొని సైబర్ మోసాలకు పాల్పడే లా చేశారు. అలాంటి లింక్‌లను ఎట్టి పరిస్థితిలోనూ ఓపెన్ చేయవద్దు.

### మహబూబ్‌నగర్ జిల్లాలో కేసులు, రికవరీ ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 2023 సంవత్‌రంలో సైబర్ నేరాల కింద 951 కేసులు నమోదయ్యాయి.అందులో 822 ఆర్థిక నేరాల కేసులు, 129 ఆర్థికేతర కేసులు నమోదు అయాయి, 2024 సంవత్‌రంలో సైబర్ నేరాల కింద 1451 కేసులు నమోదు కాగా, అందులో 1289 ఆర్థిక నేరాల కేసులు,162ఆర్థికేతర కేసులు నమోదు అయ్యాయి. 2023సంవత్సరంతో పోలిస్తే 2024లో 15.25 శాతం సైబర్ నేరాలు పెరిగాయి. అందులో 15.6 శాతం ఆర్థిక నేరాలు, 12.55శాతం ఆర్థికేతర నేరాల కేసులు పెరిగాయి. 2024లో 210 సైబర్ కేసులకు గానూ రూ.55,00,000 నగదును రికవరీ చేసినట్లు వార్షిక నివేదికలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 483 సైబర్ అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ఎస్పీ జానకి తెలిపారు.

### సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు



ఎంఎల్ఎం, పిరమిడ్ స్కీమ్స్, మనీ సర్క్యులేషన్ లో పాల్గొనడం లేదా ప్రోత్సహించడం భారత ప్రభుత్వ చట్టాల ప్రకారం శిక్షార్హమైన నేరం. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటారు. నష్టం కలిగినట్లయితే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను తక్షణమే సంప్రదించాలి. సంబంధిత సమాచారం లేదా నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి. ఇదే విషయమై జిల్లా పోలీస్ శాఖ ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రజలు మోసపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నాం. 24/7 హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎటువంటి ఎంఎల్ఎం, పిరమిడ్ స్కీమ్, మనీ సర్క్యులేషన్ మోసాల సమాచారాన్ని జిల్లా సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలి. మీ భద్రత, మీ ఆర్థిక రక్షణ కోసం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ మీతో వుంటాం. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్: 1930,మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది.

*– జానకీ ధరావత్, ఎస్పీ, మహబూబ్‌నగర్*

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ
- ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశం
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్

**అచ్చంపేట,జనవరి 28 ప్రభాతవార్త:** అచ్చంపేట కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిని సందర్శించి పేషంట్లకు అందించే సేవలను మరింత విస్తృతం చేయాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో ఉన్న విభాగాలు పరిశీలించి వాటి పనితీరును డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు. ల్యాబోరేటరీలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని గమనించి, టెక్నీషియన్‌లు ఎంతమంది పనిచేస్తున్నారని, ఈ సమయం దాకా సేవలు కొనసాగిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గది, ఒపి, ఇన్ పేషంట్ వార్డులను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఎక్స్ రే గదిని సందర్శించి రోజు ఇన్ని ఎక్సరేలు తీస్తున్నారు ఏ సమయంలో దాక తీస్తారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాక్సిన్లను భద్రపరిచిన గదిని తనిఖీ చేసి, అవసరమైన ఔషధాలను శీతలీకరణలో ఉంచేందుకు ఫ్రిడ్జ్‌లను వినియోగిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. డయాలసిస్ విభాగాన్ని పరిశీలించి, సంబంధిత సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టార్లలో నమోదయి ఉన్న రోగుల సంఖ్య గురించి ఆరా తీశారు. బ్లడ్ బ్యాంక్‌ని సందర్శించి స్టాక్ లభ్యతను తనిఖీ చేశారు. బ్లడ్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచించారు. మేల్, ఫీమెల్ వార్డులను సందర్శించి వైద్యులు అందించే సేవల గురించి పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. పేషంట్లకు అందిస్తున్న ఆహారం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది పేషెంట్లు వస్తారని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎంతమంది హాస్పిటల్ విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. స్కానింగ్ కోసం స్లాట్‌లు బుక్ చేసుకునే విధానాన్ని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఫార్మసీలో మందుల నిల్వ గురించి ఆరా తీశారు. ల్యాబ్ రెటర్‌లో ఉన్న సౌకర్యాల గురించి, జనరల్ మెడిసిన్, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని క్షుణ్ణంగా పరిశీలించి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మలేరియా డెంగ్యూ కేసులు ఎన్ని వచ్చాయని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుండి ప్రజలను కాపాడేందుకు ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సూపరింటెండెంట్ ఛాంబర్లో ఆయా విభాగాల అధిపతులతో సమావేశమై, రోగులకు అందుతున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలు ఇంకా ఏమైనా అవసరాలుంటే తనకు తెలియజేసిన యెడల వాటన్నిటిని త్వరితగతిన సమకూరుస్తామని తెలిపారు. వైద్య సేవలను మెరుగుపర్చేందుకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపర్డెంట్ ప్రభు, డ్యూటీ డాక్టర్లు తదితరులు ఉన్నారు.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# మిమ్మల్ని నా ఆత్మీయులుగా భావిస్తున్నా

**మీ పిల్లల విద్య, వైద్యానికి భరోసాగా ఉంటాం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ఘనంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త:**మిమ్మల్ని నేను ఓటు బ్యాంకుగా భావించడం లేదని, శ్రమజీవులుగా , తన ఆత్మీయులుగా భావిస్తున్నానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ప్రతి ఆటో డ్రైవర్ , క్యాబ్ డ్రైవర్ నాకు సంబంధించిన వారేనని, మీకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇంటి వద్ద మీ కోసం ఎదురు చూసే మీ కుటుంబ సభ్యులు ఉంటారనే ఆలోచన మీలో ఉండాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణంలోని అల్మాస్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీస్ , వెస్టర్న్ ఆంధ్ర టోల్వేస్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ మన ప్రాణాలకు మనమే భద్రత కల్పించుకోవాలని, ప్రమాదాలు ఏ రూపంలో వస్తాయో తెలియదని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్య భీమా తీసుకోవాలని, ఆరోగ్య భీమా ఉంటే ఆరోగ్య సమస్యలకి ఇబ్బందులు రావన్నారు. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయరాదని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్య, వైద్యం పటిష్టంగా తయారు చేస్తున్నామన్నారు. మీ పిల్లల విద్య, వైద్యానికి తోడ్పాటు అందిస్తామని, అందుకు అన్ని రకాలుగా అండగా – మిగతా4లో..



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, డి టి సి, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు

# మన్యంకొండ ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే అవకాశం**

**ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాత వార్త:** వచ్చే నెల ఫిబ్రవరి 7 నుండి మార్చి 16 వరకు నిర్వహించనున్న మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను (జాతర) అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై మంగళవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయన ఎస్.పి.డి జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బ్రహ్మోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణలోనే చిన్న తిరుపతిగా పేరుగాంచిన మన్యం కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, గత సంవత్సరం జరిగిన లోటుపాట్లు జరగకుండా ఈ సంవత్సరం భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. తాగునీరు, శానిటేషన్, టాయిలెట్లు ,బందోబస్తు రద్దీ నియంత్రణ, పార్కింగ్ వంటి సౌకర్యాలను కల్పించాలని అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా స్వామివారి దర్శనం సులభంగా అయ్యేలా చూడాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు మానిటరింగ్ కమిటీ, వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, ఫైనాన్స్ కమిటీ, ఫెస్టివల్ కమిటీ,లాఅండ్ ఆర్డర్ కమిటీలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జాతరకు ముఖ్య మంత్రి,వి.ఐ.పి.లు వచ్చే అవకాశం ఉంటుందని,అందుకనుగుణంగా అధికారులు శ్రద్ధగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే వివిధ శాఖల అధికారులకు అప్పగించిన విధులను సక్రమంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వర్తించాలని అన్నారు. అర్‌బి శాఖ బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లు క్షేత్ర స్థాయి పర్యటన చేసి ఏర్పాట్లు పరిశీలించాలని కోరారు. రాబోయే 3,4 సంవత్సరాలలో మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు భాగంగా ముఖ్యమైన రోజులైన ఫిబ్రవరి 12 న స్వామివారి గరుడ వాహన సేవ, రథోత్సవం, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి, అలాగే మార్చి 14న శ్రీ అమ్మవారి తిరుకల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహన సేవ, విమాన రథోత్సవం ఉంటాయని ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అలాగే ఇతర రద్దీ రోజులలో సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొండ దిగువన అలివేలు మంగతాయారు దేవాలయం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపు, డాక్టర్లు, మందులు ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌కో ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, జనరేటర్ ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ ద్వారా కొండపైన, దిగువన అవసరమైన –మిగతా4లో..



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**డబుల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులు**

# త్వరగా పూర్తి చేయాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**గద్వాల, జనవరి 28 ప్రభాతవార్త :** డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు పరుమాల, గోనుపాడు గ్రామాలలో నిర్మిస్తున్న రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఇళ్లను త్వరగా అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రాథమిక వసతులైన నీటి సరఫరా, విద్యుత్ – మిగతా4లో..

# కేసుల చేదనకు అన్ని కోణాలలో అన్వేషించాలి

**గ్రామాలను సందర్శించి**

**పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలి**

**అక్రమ పిడిఎస్ రైస్ రవాణాపై ప్రత్యేక నిఘ**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి క్రైమ్ జనవరి 28 ప్రభాతవార్త :** ప్రతీ గ్రామాన్ని పోలీస్ అధికారులు సందర్శించి గ్రామాలలో పూర్తి స్థాయిలో నిఘా ఉంచి ఎప్పటికప్పుడు నేరాలకు సంబంధించిన సమాచారం ముందస్తుగా తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని డిఎస్పీలు, సీఐలు,అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు తెలుసుకొని చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్నటువంటి కేసులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని, పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఎఫ్ ఎస్ ఎల్ రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్ త్వరగా తెప్పించి కేసులు చేదించాలన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేందుకు అవకాశం ఉన్నందున ప్రతి గ్రామాన్ని పోలీస్ అధికారులు వారానికి ఒక సారి సందర్శించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని, గ్రామాలలో సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ఎక్కువ మంది పబ్లిక్ తో పోలీస్ అధికారులు కాంటాక్ట్ కావడం ముందస్తు సమచారం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఇసుక, పీ.డి.ఎస్ రైస్ అక్రమ రవాణా, పేకాట జరగకుండా పకడ్బందీగా నిఘా ఉంచి పట్టుకొని కేసులు నమోదు చెయ్యాలని అన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని సూచించారు చర్యలు తీసుకోవాలని – మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

**అమరచింత జనవరి 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని కొంకనివాని పల్లె గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులను అనంతరం ఆయన మాట్లాడుతూ, మఖ్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ సహకారంతో గ్రామానికి రూ.15 లక్షల నిధులతో గ్రామంలో సిసి రోడ్లు నిర్మిస్తున్నామని సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతగా పనులు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు పోసిరి గారి విష్ణు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రకాశం, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు తౌఫిక్, కొంకనివాని పల్లె గ్రామ పార్టీ అధ్యక్షులు కురుమూర్తి, రాఘవాచారి, భగవంతు రెడ్డి, గోవర్ధన్, అంజి తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణా పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు రావడంపై హర్షం

**పెబ్బేరు జనవరి 28 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో ప్రెస్ క్లబ్ నందు మంగళవారం రోజు ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయనచేసిన కృషి ఎంతోఉందని మరో అంబేద్కర్‌ల దళితజాతుల కోసం 1994 సంవత్సరం నుంచి దండోరా ఉద్యమాన్ని స్థాపించి 40 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో దండోరా ఉద్యమం ద్వారా అనేక సంక్షేమ పథకాలు సాధించి ప్రజలకు అందించారని తెలియజేశారు. తెలంగాణప్రజలకు ఆయన చేసిన కృషి చరిత్రలో ఎంతో గొప్పగా చెప్పుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మందకృష్ణ మాదిగను కేంద్రప్రభుత్వం గుర్తించి అవార్డు ప్రకటించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దళిత నాయకులు ఎం రాజశేఖర్, పెద్దింటి వెంకటేష్, ఎద్దుల సాయినాథ్, మాలపల్లి మన్యం, మధు, గోపి బాబు, మొగులన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## విద్యార్థికి ల్యాప్ టాప్ అందజేత

**కొత్తకోట జనవరి 28 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం మిరాస్ పల్లి గ్రామానికి చెందిన పసుపుల రాములు కుమార్తె పసుపుల పూజ అనే విద్యార్థిని హైదరాబాద్ లోని సంతోష్ నగర్‌లోని బోజిరెడ్డి ఇంజనీరింగ్ ఉమెన్స్ కాలేజీలో బీటెక్‌సెకండియర్ చదువుతూ తనకు పైచదువుల నిమిత్తం ల్యాప్‌టాప్ అవసరం ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి దృష్టికి స్థానికనాయకులు తీసుకొచ్చారు. పరిస్థితిని అర్థంచేసుకున్న ఎమ్మెల్యే మానవత్వంతో స్పందించి మంగళవారం స్థానిక నాయకుల సమక్షంలో ఆ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిగా చదువుకుని మీఇంటికి, మీఊరికి మంచిపేరు తీసుకురావలని కోరారు. ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చదువు మీద ఏకగ్రత ఉంచాలని ఉద్యోగం సాధించేవరకు లక్ష్యాన్ని వదలకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి ల్యాప్ టాప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ ప్రారంభం

**ఆత్మకూరు జనవరి 28 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీ ఆవరణలో మంగళవారం రోజు మరి జిల్లా క్రికెట్ పోటీలను బిజెపి జిల్లా నాయకులు ఆత్మకూరు మున్సిపల్ తాజా మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమాన స్థాయిలో చూసి క్రీడాస్ఫూర్తి నిలబెట్టేందుకు క్రికెట్ దోహదపడాలని ఆయన సూచించారు. గ్రామస్థాయి నుండి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వాలు అందిస్తున్నటువంటి తోడ్పాటును అందిపుచ్చుకొని క్రీడల్లో రాణించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు శక్తివంతన లేకుండా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరి జిల్లా క్రికెట్ పోటీలను వివేకానంద సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బిజెపినాయకులు తమ్మలి విజయ్, ఆనంద్‌కుమార్, దేవరపల్లి ఆంజనేయులు, డాన్స్ మాస్టర్ బాలు ,సురేందర్ తదితరులతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...

**డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్**

**అమరచింత జనవరి 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా అమలుచేసి రైతు సంక్షేమమే ద్వేయముగా ముందుకు వెళుతున్నారని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని చింత రెడ్డి పల్లె గ్రామంలో రైతు భరోసా సహాయం రైతుల ఖాతాలో జమ అయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, మఖ్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు, రైతులు వారికి బుద్ధి చెప్పాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, సర్వ రెడ్డి, ఆంజనేయులు, లాల్ కోట వెంకట్ రెడ్డి, మధు, ఆనంద్, లక్ష్మయ్య, వెంకటేష్, అనంతమ్మ, వరలక్ష్మి, సంధ్య, జానకమ్మ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.


సీఎంచిత్ర పటానికి రైతుల క్షీరాభిషేకం

## ఉత్తమ ఎంపీడీవోగా జయరాం నాయక్

**నవాబుపేట, జనవరి28 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో అంకిత భావంతో అందించిన సేవలకుగాను నవాబుపేటమండల ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న జయరాంనాయక్‌కు జిల్లాకలెక్టర్ విజయేంద్ర బోయి ఎస్పీ జానకి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న నవాబుపేట మండలం ఎంపీడీవోకు ఉత్తమ సేవల పురస్కారం అందుకున్న ఎంపిడిఓ జయరాం నాయక్‌లను ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, సిబ్బంది, డా.ప్రవీణ్ కుమార్, రాఘవేందర్ ఎం పి హెచ్ ఈఓ రాములు ఎంపిహెచ్‌ఎస్ శ్రీనివాసులు ఎంపిహెచ్‌ఏ శరభలింగం డ్రైవర్ వాహబ్, గ్రామ సచివాలయాల సిబ్బంది, మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఆయనను తనకార్యాలయంలో శాలువాతో పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండలు బంక అంజన్‌కుమార్, మరికంటి నరసింహులు, మల్కాపూర్ వెంకటయ్య, చాకల్‌పల్లి మాజీ సర్పంచ్ శేఖర్, మండల సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, వెంకటయ్య, మండల నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**వ్యక్తిగత సమాచారం ఎవరికీ చెప్పొద్దు : ఎస్ఐ కె. శ్రీనివాస్**

**బిజినేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త:** సైబర్‌నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకుని నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారని ఎస్ఐ కె. శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ అనవసర లింక్‌లను క్లిక్ చేయడం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం ఎవరికీ చెప్పొద్దు అని, సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. బ్యాంక్ నుంచి మట్లాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండి, మీ ఏటీఎం పని చేయడం లేదని, కారు గెల్చుకున్నారని, మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ తెలియకుండానే డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. లాటరీలు, రివార్డులు, జాబ్స్, కమీషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపి నిలువునా ముంచుతున్నారని అప్రమత్తతో ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి ఫోన్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా సీసీ కెమెరాల అవశ్యకతను, ట్రాఫిక్ రూల్స్ పాటించడం, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చట్టాలపై అవగాహన కల్గి ఉండి చట్ట పరిధిలో శాంతియుత జీవనం సాగించేందుకు ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆంజనేయులు, ఏఎస్ఐలు శ్రీనివాసులు, సయ్యద్ అలీ, రవి నాయక్ తదితరులు ఉన్నారు.



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ కె శ్రీనివాస్

# శ్రీ శ్రీ శ్రీ భూ లక్ష్మి చెన్నకేశవ స్వామి, కళ్యాణ మహోత్సవం

**బ్రహ్మోత్సవాలు, శ్రీ శ్రీ జమ్ములమ్మ పరశురాముడు దేవస్థానం**

**బ్రహ్మోత్సవాల కోసం చేనేత సారే, పట్టు వస్త్రాల తయారీ**

**ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి**

**గద్వాల, జనవరి 28 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ భూ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయం లో చేనేత కార్మికులచే త్వరలో జరగబోయే గద్వాల జాతర శ్రీ శ్రీ శ్రీ భూ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు మహోత్సవం, శ్రీ శ్రీ జమ్ములమ్మ అమ్మవారి, పరశురామ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంప్రదాయ బద్ధంగా చేనేత సారే, పట్టు వస్త్రాలను తయారీకి గద్వాల ఎమ్మెల్యేబండ్ల కృష్ణమోహన్ రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి సారే, స్వామివారి పట్టు వస్త్రాలను, తయారీని ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను పొందారు. భూలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణం జములమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు, గద్వాల ఎమ్మెల్యే తరఫున ప్రతి సంవత్సరం సారేని అమ్మవారికి సమర్పించడం జరుగుతుంది. గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అమ్మవారి, స్వామి వారి కళ్యాణ, మహోత్సవం పురస్కరించుకొని గద్వాల చేనేత కార్మికులచే అమ్మవారికి కళ్యాణానికి చేనేత సారే, పట్టు వస్త్రాల ని సమర్పించడం జరుగుతుందన్నారు. గద్వాల చేనేత కార్మికుల ఆధ్వర్యంలో సాంప్రదాయం ప్రకారం అమ్మవారి సారే, స్వామి వారి పట్టు వస్త్రాలను ను తయారుచేసి అమ్మవారికి, స్వామి వారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. భూ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయం రాఘవేంద్ర మంత్రాలయం పీఠాధిపతి ఆశీస్సులతో దిన,దిన అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా భవిష్యత్తులో కూడా దేవాలయము, గద్వాల నియోజకవర్గం రాఘవేంద్ర పీఠాధిపతి ఆశీస్సులతో అభివృద్ధి చెందాలని కోరారు. భూ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి, జములమ్మ అమ్మవారి ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గం ప్రజలకు రైతులకు సకాలంలో వర్షాలు పడి మంచి పంటలు పండి గిట్టుబాటు ధర రావాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్స్ మురళి, దౌలు, నాయకులు డి.ఆర్ విజయ్, గోవిందు, కురుమన్న, ధర్మ నాయుడు, పూడూరు చిన్నయ్య, చేనేత కార్మికులు సంఘం నాయకులు అక్కల శ్రీనివాసులు, మంత్రి సురేష్, శాంతిన్న, చేనేత కార్మికులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చెన్నకేశవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


స్వామి వారికి పట్టు వస్త్రాల తయారిని ప్రారంభించిన ఎమ్మెల్యే

# పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

**పోలీస్ వాహనాలకు కొత్త టైర్లు, బ్యాటరీలు అందజేసిన చేసిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి క్రైమ్ జనవరి 28 ప్రభాతవార్త :** పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధులలో భాగంగా ఉపయోగించే పోలీస్ వాహనాల యొక్క టైర్లు, బ్యాటరీలు, క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో మార్చుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పోలీసులకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వనపర్తి పోలీసు ఎం.టి. విభాగం రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ (పిటిఓ) పోలీస్ ట్రాన్స్పోర్ట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ విభాగం నుండి వచ్చిన స్పేర్ పార్ట్స్, టైర్లు, బ్యాటరీలు, పోలీసు వాహనాలకు (ఫోర్ వీలర్ టు వీలర్) వాహనాలకు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ గౌరవం మీ చేతుల్లో ఉందనే విషయం గుర్తుంచుకుని, క్రమశిక్షణతో విధి నిర్వహణ చేస్తూ వాహనాల నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. అతి వేగంతో వెళ్లకూడదని, ప్రతి ఒక్కరూ వాహనాన్ని తమ స్వంత వాహనం లాగా చూసుకుంటూ శుభ్రంగా పోలీసుశాఖ క్రమశిక్షణ ప్రతిబింబించేలా చూడాలన్నారు. ఘటనా స్థలానికి వెళ్లే సమయంలో, ఎస్కార్ట్, నేర పరిశోధన ప్రాంతాలకు, వెళ్లే సమయంలోనూ వాహన సామర్థ్యానికి అనుగుణంగా వాహనాలను నడపాలని, నిర్దేశించిన వేగం మించకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. పోలీస్ స్టేషన్ల వారీగా వాహనాలను ఎం.టి. రిజర్వ్ ఇన్స్పెక్టర్ పరిశీలించి నివేదిక సమర్పించాలని ఎస్పీ ఆదేశించారు. వాహనాల నిర్వహణ సక్రమంగా ఉండే వారిని గుర్తించి వారికి రివార్డులు ఇచ్చి ప్రోత్సహించడంతో పాటు, నిర్వహణ సరిగా లేని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వాహనాల పార్కింగ్ సమయంలోనూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పి, ఉమా మహేశ్వరరావు, వనపర్తి సిఐ, క్రిష్ణ, కొత్తకోట సీఐ. రాంబాబు, ఆత్మకూర్ సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు ఎం.టి. విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ వాహనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ డిఎస్పి సిఐలు

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో నిబంధనలు ఎత్తివేయాలి

**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం**

**అమరచింత జనవరి 28 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిబంధనలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండల తహశీల్దార్ రవికుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్, రైతు సంఘం జిల్లా కోశాధికారి బి వెంకటేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గ్రామీణ ప్రాంతంలోనే అమలు చేస్తున్నారని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిబంధనలు ఎత్తివేసి పట్టణ ప్రాంతాలలో కూడా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు జాబ్ కార్డు ద్వారా ఉపాధి హామీ పనులు చేసిన వారికే పథకం వర్తించడం అన్యాయమని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 20 రోజుల పని నిబంధనను ఎత్తివేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు ఒకే అప్లికేషన్ ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, మహేందర్, అంజి, వెంకటేష్, మన్యం, రాములు, జానీ, రాము, శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కు వినతి పత్రం

# ఉపాధి హామీ పనులను మార్చిలోపు పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్**

**వనపర్తి టౌన్ జనవరి 28 ప్రభాతవార్త :** జిల్లాలో ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన పనులను ఈ ఏడాది మార్చి లోపు పూర్తి చేసి, లక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ లక్ష్యాలపై ఎంపీఓలు, ఏపీఓలతో డి ఆర్ డి ఓ ఉమాదేవితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన పనులను ఈ ఏడాది మార్చిలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు వందరోజుల పని లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కూలీలకు సమయానుసారంగా పేమెంట్లు పూర్తి చేయడమే కాకుండా, వారితో నిర్దేశించిన పనులను కూడా సక్రమంగా చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ వారానికి ఆ వారం 100 పేమెంట్లు పూర్తయ్యేలా ఏపీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీ పనులు అంతరాయం లేకుండా పూర్తి చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలకు తప్పకుండా నీరు అందించి సంరక్షించాలని ఆదేశించారు. నర్సరీలకు కూడా పేమెంట్స్ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా మంజూరు అయినా 317 మరుగుదొడ్లు పూర్తి చేయాలీ సామూహిక మరుగుదొడ్లు కూడా మార్చి లోపు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి యావరేజ్ వేజ్ రేట్, లేబర్ టర్న్ అవుట్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ ఉమాదేవి, ఎంపీఓలు, ఏపీఓలు హాజరయ్యారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# తట్టెడు మట్టి వేయడానికి ఒక నయా పైసా ఇవ్వలేదు ఎమ్మెల్యే

**కొత్తకోట జనవరి 28 ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి ఎమ్మెల్యే జియంఆర్ ఒక తట్టెడు మట్టి వేయడానికి ఒక నయా పైసా ఇవ్వలేదని పైగా కొత్తకోట అభివృద్ధికి ఆలన్న సాధించిన నిధులతో టెండర్ అయిపోయిన నిధులను ఆపి కొత్త రాజకీయ చరిత్ర సృష్టించారని జిల్లా బిఆర్ఎస్ నేత నారామాన్ అయ్యన్న అన్నారు. మంగళవారం కొత్తకోటలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ మార్కెట్ చైర్మన్ పదవులకు ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించిన సందర్భం లేదని కేసీఆర్ ఎస్సిలకు రిజర్వేషన్ చేస్తే మీకు ఆ పదవి వరించిందని గుర్తు చేశారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆలన్న పై పస లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్థాయి మించిన ప్రకటనలు మానుకొని పట్టణ అభివృద్ధికి పాటుపడి ఆగిపోయిన పనులను ప్రారంభించి పూర్తి చేయించి మీ చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు. కొత్తకోటలో మార్కెట్ చైర్మన్ తో పాటు కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్ పార్టీ పై చేసిన పసలేని ఆరోపణలకు విమర్శలకు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆలన్న చిన్న చింతకుంట ఊకచెట్టు వాగుపై బ్రిడ్జి కట్టి పేదల తిరుపతి కురుమూర్తి స్వామీ ఘాట్ రోడ్డుకు 40కోట్లు సాధిస్తే మీ ఎమ్మెల్యే 110 కోట్లకు నిధులు పెంచారే తప్పా కొత్తగా సాధించింది ఏమీ లేదన్నారు. దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రికి కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి మాజీ మంత్రి హరీష్ రావు నిధులు కేటాయించి ప్రొసీడింగ్స్ ఇచ్చి భూమి పూజ చేస్తే పనులు ప్రారంభం చేయడానికి ఎమ్మెల్యేకు చేతకాక కొత్త రాజకీయం చేస్తున్నారని ఇవన్నీ ప్రజలు గమనించి మీ కాంగ్రెస్ పార్టీ పై చీదరించుకొంటున్నారని మండిపడ్డారు. కరోనా వ్యాధి కంటే కాంగ్రెస్ డేంజర్ అంటున్నారు. అనవసరమైన ప్రకటనలు ఇచ్చే ముందు ఆలోచన చేసి ఇవ్వండని హితవు పలికారు. అదేవిదంగా మాజీ కౌన్సిలర్ ఖాజా మైనోద్దీన్, బిఆర్ఎస్ నేత చింతలపల్లి రవీందర్ రెడ్డి లు మాట్లాడుతూ కొత్తకోటశని పోయిందని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలకు తీవ్రంగా ఖండిస్తూ కొత్తకోటకు రాహువు కాలం మొదలైందని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఒక్కో వార్డులో 300 పైగా కుటుంబాలు ఉన్నట్లు తెలిందని అందులో 100పైగా రేషన్ కార్డులు లేని వారు మరో 100పైగా కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్త శుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ తీర్మానం ప్రకారం 40 ఫీట్ల సెట్ బ్యాక్ చేస్తూ డ్రైనేజి నిర్మిస్తుంటే మాకు సహకరించలేదని పైగా హై కోర్టు నుండి స్టే ఆర్డర్ తీసుకొని రాగ అక్కడ పనులను ఆపితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ షాపు యజమాని ఎమ్మెల్యే సహకారంతో బిల్డింగ్ సెట్ బ్యాక్ చేయకుండా 35ఫీట్లకే నిర్మాణం చేసుకొన్నాడని గుర్తు చేస్తూ మీరు చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. షాదీఖానకు కేవలం సున్నం వేసి బిల్లులు తీసుకొన్నారని చెప్పిన మాటలకు తీవ్రంగా ఖండిస్తున్నానని కేవలం 4 లక్షల 50వేలకు మాత్రమే బిల్లులు అయినాయని ఇంకా లక్షా 80వేల రూపాయలు ఎస్టీఓ కార్యాలయం ద్వారా రావాల్సి ఉందని అవగాహనా లేని ప్రకటన ఇచ్చే ముందు మున్సిపల్ ఎఈ ను, డిఈఈ ను, మున్సిపల్ కమీషనర్ తో పాటు మా పార్టీ నుండి మీ పార్టీలో మారి మీ సంకలో ఉన్న షాదిఖానా కాంట్రాక్టర్ సుబాష్ ను అడిగి అనుమానం నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాములు యాదవ్, సాజిద్, వసీం, అద్వాని శ్రీను, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## జిటీప డైరీ ఆవిష్కరణ

**కొత్తకోట జనవరి 28 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం వనపర్తి జిల్లా 2025 డైరీ, క్యాలెండర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ వివేకానంద్, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ దేవని, ప్రధాన కార్యదర్శి రఘునాథ్, ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిటిఏనాయకులు ప్రవీణ్‌రెడ్డి కేశవా చారి, సత్యనారాయణ, రమేష్, విజయలక్ష్మి, పద్మావతి, రవికుమార్ , సుధారాణి, వెంకటేష్, నాజిమా, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిఆర్ఎస్ పార్టీ సమన్వయ సమావేశం

**నవాబుపేట, జనవరి28 ప్రభాతవార్త:** నేడు నవాబుపేట మండల కేంద్రంలో నిర్వహించనున్న టిఆర్ఎస్‌పార్టీ సమన్వయ సమావేశానికి మాజీమంత్రి మహబూబ్‌నగర్‌జిల్లా బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు, చర్లకోలలక్ష్మారెడ్డి ఆదేశాలమేరకు బుధవారం రోజు ఉదయం పదిగం.లకు నవాబ్‌పేట్ మండల కేంద్రంల్లో బ్లూమూన్ హోటల్ ఎదురుగా బిఆర్ఎస్. పార్టీ సమావేశానికి పార్టీ నాయకులు గ్రామ మండల నాయకులు సమయానికి హాజరు కావాలని మండల బిఆర్ఎస్ నాయకులు మాడెమోని నర్సింలు కోరారు.

## విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్ వితరణ


గ్రామంలో విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ దృశ్యం

**అమరచింత జనవరి 28 ప్రభాతవార్త :** అమరచింత మండలంలోని ఈర్లదిన్నె, మస్తీపూర్, గ్రామాలలో జిల్లాప్రజాపరిషత్ పాఠశాలలో చదువుతున్న పదవతరగతి విద్యార్థిని విద్యార్థులకు అమరచింత మండల యూత్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు లాల్‌కోట శరత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు లాల్‌కోట వెంకట్‌రెడ్డి విద్యార్థులకు పరీక్షలు రాసే ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు ప్యాడ్స్‌తో పాటు పరీక్షలకు అవసరమైన సామాగ్రిని అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అలాగే పుట్టిన బిడ్డకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**వెల్దండ, జనవరి 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కే.వెంకటయ్య, బి.మహేష్, యాదగిరిలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గాయపడిన బాధితులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వారి నివాసాల వద్దకు వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఆర్థిక సహాయాన్ని అందించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జంగిలి నిరంజన్, మొక్తాల శేఖర్ ముదిరాజ్, చల్లా మధుసూదన్ రెడ్డి, జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్ సైదులు, నరసింహ, తోపాటు తదితరులు ఉన్నారు.

## పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంతోష్

**వెల్దండ, జనవరి 28 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఈదమ్మ బండ తండాకు చెందిన సంతోష్‌ను ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ యూనివర్సిటీ సమస్యల పైన, విద్యార్థుల సమస్యలపైన నిరంతరం పోరాటం కొనసాగించి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు సంతోష్ ను అభినందించారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

**మద్దూర్, జనవరి 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో మంగళవారం కందుల కొనుగోలు కేంద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్ది భీములు ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.7550 చేస్తామని మద్దూర్ సింగిల్ విండో ఛైర్మన్ నరసింహ తెలిపారు. యూరియా కూడా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాసిన్, దుప్పటి కట్టు మాజీ ఛైర్మన్ వెంకట్, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## మద్దూర్ మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు


మున్సిపల్ కమిషనర్ నాగరాజు

**మద్దూర్, జనవరి28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ నూతన మున్సిపాలిటీగా ఎన్నికైన తర్వాత నూతన కమిషనర్‌గా ఏ నాగరాజు పదవిబాధ్యతలు స్వీకరించారు. ఆయన మద్దూర్ గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యాదయ్య, టిపిఓ కిరణ్, ఆంజనేయులు ,రఘు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం ప్రశంసనీయం

■జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

**ఊర్కొండ, జనవరి 28 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలంలో నిఖిల్ రెడ్డి ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టి పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలో మాధారం మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి పుట్టినోజు సందర్భంగా తన స్వంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో తన పుట్టినరోజు కానుకగా 13 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి నాయకులు అవసరమని, నాకు ఇలాంటి మిత్రుడు ఉండటం సంతోషమన్నారు. అనంతరం ద్యాప నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అడుగు జాడల్లో నడుస్తూ ఎమ్మెల్యే సహకారంతో ఊర్కొండ మండలాభివృద్ధికి పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనార్టీ అబ్దుల్ సమీ, యూత్ అధ్యక్షుడు ఆదినారాయణ, పాలకమండలి సభ్యులు గోపి నాయక్, నాయకులు, వాహిదొద్దిన్, మనోహర్ రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకోవాల్సిందే..

■ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్


మాట్లాడుతున్న విసి శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యా వరణ సమతుల్యతను కాపాడడానికి అందరూ పాటుపడాలని పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీని వాస్ అన్నారు. పర్యావరణాన్ని పరి రక్షించకపోతే భవిష్యత్తులో ఆక్సిజన్ సిలిండర్లు వెంటబెట్టుకొని తిరిగాల్సి వస్తుందన్నారు. పీయూ పరిధిలోని కొల్లాపూర్ పీజీ సెంటర్ లో సోషల్ వర్క్ విభాగ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధి అనే అంశంపైరెండు రోజులు అంతర్జాతీయ సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సుకు ఉపకులపతి ఆచార్య జి. ఎన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహజ వనరులను సంరక్షించుకోవాలని, చెట్లపెంపకం ద్వారా, గ్లోబల్ వార్మింగ్ తగ్గించడం ద్వారాపర్యావరణాన్ని సంరక్షించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.మార్క్ పోలోనియస్, ప్రధాన వక్తలు ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి, ప్రొ॥ రవీందర్ రేనా, డా. విజయలక్ష్మి, కన్వీనర్ దేవరాజ్, విద్యార్థులు పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లి మండల ఎంపీడీవోగా సాహిద్ ఖాన్


నూతన ఎంపీడీవోను సన్మానిస్తున్న మాజీ ఉపసర్పంచ్ పద్మ వెంకటన్న, పంచాయతీ కార్యదర్శులు

**ఇటిక్యాల, జనవరి28 ప్రభాతవార్త :** ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి గ్రామపంచాయని కొత్త మండలంగా ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అందులో భాగంగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్త ఎర్రవల్లి మండలానికి ధరూర్ మండలంలో ఎంపీఓగా పనిచేసిన సాహిద్‌ఖాన్ ను ఎర్రవల్లి మండల అడిషనల్ ఇంచార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల ఎంపీడీవోగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగన్న, తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి, ఎర్రవల్లి మాజీ ఉపసర్పంచ్ పద్మ వెంకటన్న, పెద్ద లక్ష్మన్న తదితరులు నూతన ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

## బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని వినతి



**నారాయణపేట టౌన్, జనవరి 28 ప్రభాత వార్త :** కోటకొండ నుండి అప్పక్‌పల్లి గ్రామం వరకు నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఎఐయుకెఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, మాట్లాడుతూ నారాయణ పేట్ జిల్లా కేంద్రం నుండి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంకు కోటకొండ, కోయిలకొండ నుండి వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మాణం చేయుటకు 2023 సంవత్సరంలో మంజూరైందన్నారు. గత సంవత్సరంలో కోయిలకొండ నుండి వింజమూరు వరకు నిర్మాణం చేయడం జరిగింది. కోటకొండ నుండి అప్పక్ పల్లి వరకు రోడ్డు నిర్మాణం ప్రారంభమై సంవత్సరం గడుస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తి కావడం లేదు. రోడ్డు మొత్తం తవ్వి ఉంచడం వల్ల ప్రయాణికులకు తీవ్రమైన ఇబ్బందులుపడుతున్నారన్నారు. ముఖ్యంగా ఆటో, ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులకు గతుకుల రోడ్డు వల్ల నడుముల నొప్పులతో ఆసుపత్రుల పాలవుతున్నారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలన్న రోడ్డు కారణంగా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దుమ్ము, ధూళి వల్ల నిమోనియా, హస్తమ తదితర వ్యాధులకు గురవుతున్నారన్నారు. వినతి పత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ జయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సునీత, కెంచె నారాయణ, నర్సింలు, భీమేష్, సుధాకర్, మిట్టే కాశీనాథ్, రాజు, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## యూజీసీ పే స్కేల్స్ అమలు పరచాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 12 యూనివర్సిటీలలో పని చేస్తున్న 1445 మంది ఒప్పంద అధ్యాపకులకు వెంటనే యూజీసీ పే స్కేల్స్ అమలు పరచాలని పాలమూరు విశ్వవిద్యాలయ ఒప్పంద అధ్యాపకులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జెస్‌తో నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి యూనివర్సిటీనే నమ్ముకొని చాలీ చాలని జీతంతో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్స్ అమలు పరిచి, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డా. రవి కుమార్, డా. ప్రభాకర్‌రెడ్డి, డా. సుదర్శన్‌రెడ్డి, డా.గౌస్ మొయిద్దీన్, డా. ఈశ్వర్ కుమార్, డా. జ్ఞానేశ్వర్, డా. రవికాంత్, డా. సోమేశ్వర్, డా.ప్రదీప్, డా. రామ్మోహన్, డా. మధు, డా. కల్పన, డా. చెన్నయ్య పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేసిన అదనపు కలెక్టర్

**గద్వాల జనవరి 28 ప్రభాతవార్త:** నూతన క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ నర్సింగాపూర్ ఆవిష్కరణ చేశారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్, జోగులాంబ గద్వాల్ జిల్లా యూనిట్ కు చెందిన క్యాలెండర్ మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నర్సింగ్‌రావు అదనపు కలెక్టర్, లోకల్ బాడీస్ ఆవిష్కరణ చేశారు. నూతన క్యాలెండర్ 2025 ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ బషీర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ .కలీం, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బషీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు ఎం.డి ఖాజా పాషా, కోశాధికారి ఎం డి హనీఫ్, జాయింట్ సెక్రటరీ షేక్ ఫర్దీన్, ఎండి. మస్తాన్ వలి, ఎం.డి దర్వేష్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న యువశక్తి ఫౌండేషన్



**నారాయణపేట టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా దామర గిద్ద మండలం మల్ రెడ్డి పల్లికి గ్రామానికి చెందిన 15 రోజుల పసిబిడ్డ పాలమూరు జిల్లా ఏరియా హాస్పిటల్‌లో అడ్మిట్ అవ్వడం జరిగింది. రక్తకణాలు పడిపోవడంతో డాక్టర్లు వెంటనే రక్తం ఎక్కించాలనడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా బ్లడ్ బ్యాంకులలో రక్తం దొరకకపోవడంతో ఆందోళనలో పడ్డ కుటుంబ సభ్యులు స్థానికుల సమాచారం మేరకు యువశక్తి ఫౌండేషన్‌ని ఆశ్రయించారు. మానవత్వంతో స్పందించిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థపక అధ్యక్షులు కాగితాల మధు, ఫౌండేషన్ మెంబర్ భరద్వాజ్, సాయిచరణ్‌లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ భరద్వాజ్, సాయి జయంత్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం


విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలంలోని నాగనూల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని డిఇఒ రమేష్‌కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ దేవ సహాయం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, ప్లే గ్రౌండ్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్న బియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. కోడిగుడ్లు బాగున్నాయో, చెడిపోయాయో అని తనిఖీ చేస్తూ నాణ్యతను నీటితో నిండి ఉన్న గిన్నెలో వేసి పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆహార పదార్థాలు, భోజనం వండేందుకు వినియోగించే పదార్థాలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. స్టోర్ రూమ్ లో గోధుమ పిండి, ఇతర ప్యాకెట్లు తెరిచి ఉండడాన్ని గమనించిన అదనపు కలెక్టర్, వాటిని కలుషితం కాకుండా జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. నాసిరకమైన బియ్యం, ఇతరఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన పక్షంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు జరిపించాలని ఆదేశించారు. విద్యార్థినులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య గురించి ఆరా తీశారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. ఏమైనాసమస్యలు ఉంటే సెక్టోరియల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట డిఇఒ రమేష్ కుమార్, గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి కేజీబీవీ పాఠశాలల పర్యవేక్షణ అధికారిని శోభారాణి ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జనవరి28 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం, మై భారత్ ఆధ్వర్యంలో రోడ్డు నిబంధనలు, నియమాలు, హెల్మెట్ వాడకంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15 మంది స్వచ్ఛంద ట్రాఫిక్ వాలంటీర్స్‌ను ఎంపిక చేసి టి షర్ట్స్, క్యాప్స్ పంపిణి చేశారు. అనంతరం బస్‌స్టాండ్ నుంచి పాలమూరు చౌరస్తా వరకు ట్రాఫిక్ నియమాలపై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో వాహన దారులకు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ ధరించాలని సూచనలు తెలిపారు. అధ్యక్షుడు శివ కుమార్ మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ నియమాలను ప్రజలకు తెలియపర్చడం వలన ప్రమాదాలు తగ్గించి డ్రైవింగ్ చేస్తే అందరికీ శ్రేయస్కరం, వాహనదారులకు క్రమశిక్షణ పెంచడం సాధ్యమవుతుందని కోరారు. యువత మద్యం, మత్తుకు అలవాటు పడిఅధిక వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని, 18సం॥లు దాటిన ప్రతి ఒక్కరు లైసెన్స్ తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసి ప్రజలకు అవగాహన పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గా ప్రసాద్, నర్సింహ, సేవ బృందం సభ్యులు లక్ష్మినరసింహ, అజయ్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హోలియ దాసరి సంక్షేమం కోసం కృషి చేస్తాం

◆ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


సంచార జాతుల సంగం అధ్యక్షున్ని సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల జనవరి 28 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్ నందు తెలంగాణ హోలీయ దాసరి సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం మహోత్సవానికి ఎమ్మెల్యేబండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే కి హోలీయ దాసరి సంఘం నాయకులు పుష్ప గుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఎమ్మెల్యే సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. వారికి ఎమ్మెల్యే శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. భారత దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచం కూడా అన్ని రంగాలలో టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినా కూడా హోలీయ దాసరి సంచార జాతర అభివృద్ధి చెందడం లేదన్నారు. వారు ఇంకా వారి జీవనోపాధి కొరకు ప్రతిరోజు ఒక ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనోపాధిని కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. భారతదేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది కానీ, ఈ సంచార జాతుల వారికి ఎందుకు న్యాయం చేయడం లేదో, నాకు అర్థం కావడం లేదన్నారు. మీరు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వీరికి కూడా అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉండే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గద్వాల నియోజకవర్గంలో సంచార జాతులు వారు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించి వారికి నా వంతు సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తూ ఉన్నానని తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పథకాలలో సంచార జాతుల వారికి ప్రాధాన్యత కల్పించే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్తులో కూడా సంచార జాతులు, హోలీయ దాసరి సంఘం అభివృద్ధి కొరకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్‌గౌడు మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, నాయకులు గోవిందు కురుమన్న ధర్మనాయుడు, వీరేష్, పూడూరు చిన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా హోలీయ దాసరి సంఘం నాయకులు, రామచంద్రుడు, ఆంజనేయులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంచి నడవడికతో జీవనం సాగించాలి

షబ్ ఏ మేరాజ్ అంటే ప్రవక్త దేవుడిని కలిసిన రోజు : జామె నిజామియా ఆలీమ్ డాక్టర్ మహమ్మద్ ఖాజామొహియుద్దీన్ నక్ష్ బంది


మహమ్మద్ ప్రవక్త గురించి బోధన చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** షబ్ ఏ మెరాజ్ ఇస్లాం మతంలో ఎంతో ప్రాధాన్యత కలదని, మహమ్మద్ ప్రవక్త ఆ రోజు ఏడు లోకాలలోని అల్లాను కలిసిన పవిత్రమైన రోజని హైదరాబాద్ జామె నిజామియా ఆలిం డాక్టర్ మహమ్మద్ ఖాజామొహియుద్దీన్ నక్ష్ బంది అన్నారు. నాగర్‌కర్నూల్ జామా మస్జిద్ ఆపద్ధర్మ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి షబ్ ఏ బరాత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ మహమ్మద్ ఖాజామొహియుద్దీన్ నక్ష్ బంది మాట్లాడుతూ ఈ రాత్రికే మహమ్మద్ ప్రవక్త ఏడు లోకాలలోని అల్లాను కలిసి వచ్చిన తీరును కళ్లకు కట్టినట్లు వివరించారు. అల్లాను కలిసిన ఈ తరుణంలోనే 5పూటల నమాజు మానవాళిపై ఖచ్చితమైందని ఆయన వివరించారు. మానవాళి కోసం ప్రవక్త ఎన్నో త్యాగాలను అల్లాతో కోరి మనకు అప్పగించారని, వాటిని సమగ్రంగా పాటిస్తూ స్వర్గలోకానికి సమాయత్తం కావాలన్నారు. దేవుడు చూపిన మార్గాన్ని అనుసరించకుండా వక్రమార్గము ద్వారా వెళితే నరకమే ప్రాప్తిస్తుందన్నారు. ఇస్లాం ధర్మంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చూపిన మార్గాన్ని అనుసరిస్తూ స్వర్గానికి దారులు వేసుకోవాలని సూచించారు. అంతకుముందు మహమ్మద్ సాదిక్ పాషా నక్షబందీ, మహమ్మద్ ఇబ్రహీంతోపాటు మరికొందరు నాతియా కార్యక్రమాలతో అలరించారు. షబ్ ఏ మేరాజ్ నమాజ్ ఇమామ్ అబ్దుల్ హక్ చదివించగా మిలాద్ షరీఫ్‌ను షేఖ్ యాకూబ్ బావాజీర్ బృందంఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆపద్ధర్మ మజీద్ కమిటీ బాధ్యులు జైనుల్ అబిదీన్, మహమ్మద్ ఖాదర్, మహమ్మద్ ఖాజు బాబా, నయుమ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మస్జిద్ మహఫూజ్ బిన్ మహఫూజ్, మస్జిదే ఖమర్ ఉన్నిసా, మస్జిద్ మహమ్మదీయ, మస్జిద్ ఏ మెరాజ్ లలో షబ్ ఏ మేరాజ్ పవిత్ర రోజును నిర్వహించారు.

## 7న జరిగే లక్ష డప్పులు వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



**వెల్దండ, జనవరి 28 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వచ్చేనెల ఫిబ్రవరి 7వ తారీకున హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు వేల గొంతుకల కార్యక్రమాన్నివిజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, వీరస్వామి మాదిగలు అన్నారు కేంద్రంలోని ఏవిఆర్ గార్డెన్‌లో మండల ఎమ్మార్పీఎస్ మాదిగ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మబ్బు సాయన్న మాదిగ, వీరస్వామి మాదిగలు ముఖ్య అతిథులుగా విచ్చేసి పోలే అశోక్, దూల సామేల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో మాలల కంటే మాదిగలు వెనుకబడి ఉన్నారని కుట్ర చేసి ఏబిసిడి వర్గీకరణ అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తేచూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. చేపట్టిన కార్యక్రమాన్నికి మాదిగ సోదరులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామమన్నారు. కార్యక్రమంలో కాటిక రామస్వామి, దుబ్బ నాగేష్ పోలే రాజు, గుద్దటి ప్రభాకర్ కురుమిద్దె యాదగిరి, గుద్దటి రామస్వామి, తక్కలపల్లి శేఖర్, అంజయ్య, పుల్లయ్య, శ్రీను, పెద్దయ్య తో పాటు తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రత అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతను పురస్కరించుకుని ముద్రించిన గోడపత్రికలు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరికీముఖ్యమైనదని, ఈ ప్రమాదాలను నివారించడానికి, రోడ్డు భద్రత గురించి అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా, విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు వీలుగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా చర్యలు పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా రవాణా శాఖ అధికారి చిన్న బాలు, రోడ్డు సేఫ్టీ అధ్యక్షుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



అమ్మాయి మరణానికి కారణమైన

## నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

**ధన్వాడ, జనవరి 28 ప్రభాతవార్త :** మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అమ్మాయిని కొట్టి, వేధించిన కన్మనూర్ గ్రామానికి చెందిన తెలుగు వంశి అలియాస్ చింటూపై నేరం నిరూపణ అయినందున ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమాన విధిస్తూ నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జ్, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వింధ్యనాయక్ తీర్పు చెప్పారని ఎస్పి యోగేష్ గౌతం తెలిపారు. ఫిర్యాదుదారుడు తిమ్మప్ప, తన రెండవ కూతురు మహబూబ్‌నగర్ కాలేజీలో చదువుకుంటున్నపుడు నిందితుడు మా అమ్మాయితో చనువుగా ఉండి ఫ్రెండ్‌షిప్ చేసి ప్రేమ పేరుతో వేధించి, ఎవరితోనైనా మాట్లాడితే చంపేస్తానని బెదిరించి ఇంతకుముందు తీసుకున్న ఫోటోలను మీ ఊర్లో అందరికీ చూపిస్తానని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని వేధించి కోచింగ్ సెంటర్ వద్ద, పిల్లలమర్రి దగ్గర బస్టాండ్‌లో మూడు చోట్ల కొట్టి వేధించగా సెలవుల్లో 13, సెప్టెంబర్ 2017 నాడు ఇంటికి వచ్చి అర్ధరాత్రి అందరు పడుకున్నప్పుడు పంట పొలానికి తెచ్చిన పురుగుల మందు తాగగా వెంటనే మహబూబ్‌నగర్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లగా ట్రీట్మెంట్ పొందుతూ మ కూతురు చనిపోవడం జరిగిందని మా కూతురు చనిపోవడానికి కారణమైనవ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అప్పటి మరికల్ ఎస్సై జములప్పకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఇన్వెస్టిగేషన్ చేయగా సిఐ రామ్‌లాల్, కోర్టులో చార్జ్ వేశారని తెలిపారు. ప్రస్తుత సిఐ రాజేందర్ రెడ్డి, ఎస్ఐ రాములు ఆదేశాల మేరకు ఏఎస్సై కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కృష్ణయ్య గౌడ్, సిడిఓలు వీరప్ప, హన్మంతు, శ్రీధర్‌లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేనుశ్రీ కోర్టులో వాదనలు వినిపించగా జడ్జి వింధ్య నాయక్ నిందితునిపై మంగళవారం తీర్పు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో బాగా పనిచేసిన పోలీసు అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను, కోర్టు లైజనింగ్ అధికారి, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డ్ ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు.

## నేడు ఎస్ఎస్‌సి విద్యార్థులకు ప్రేరణ తరగతి

**చిన్న చింతకుంట, జనవరి 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్ హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ప్రేరణ తరగతి కార్యక్రమాన్ని విద్య అభివృద్ధి కమిటీ, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యా అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు అనే తెలిపారు. ఈ ప్రేరణ తరగతులు విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. ఈ ప్రేరణతరగతికి స్థానికఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జిల్లావిద్యాధికారి ఎ.ప్రవీణ్‌కుమార్, ప్రముఖ సైకాలజిస్ట్ వంగిపురం శ్రీనాథ్‌చారిలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్య క్రమానికి మండలంలోని ప్రభుత్వజడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులువారి తల్లిదండ్రులు, విద్యాభివృద్ధి కమిటీసభ్యులు హాజరైవిజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**చిన్న చింతకుంట, జనవరి 28 ప్రభాతవార్త:** రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని స్థానిక ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్ర సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రోడ్డు భద్రతపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాల లైసెన్స్ కలిగిన వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే తద్వారా జరిగే రోడ్డు ప్రమాదాల వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్, లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. వాహనంపై నంబర్ ప్లేట్‌ను ఉంచుకోవాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే సురక్షితమైన ప్రయాణం జరుగుతుందని, వేగం కన్నా ప్రాణం ముఖ్యం అనే భావనతో వాహనదారులు ప్రయాణం కొనసాగించాలని ఆయనసూచించారు. ఈ సమావేశంలో కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు వినతి

**మద్దూర్, జనవరి 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండలపరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోవెలసిన గురులోకమసంద్ ప్రభువు జాతరకు సంబంధించి మంగళవారం నారాయణపేట జిల్లా కలెక్టర్‌ను దేవాలయ కమిటీ సభ్యులు కలిసి జాతరలో మంచినీటి, విద్యుత్, బాత్రూములు మొదలగువాటిగురించి అన్నిశాఖలఅధికారులతోని సమావేశంఏర్పాటు చేయాలని దేవాలయకమిటీ కలెక్టర్‌తో మాట్లాడినట్లు వారుఒక ప్రకటనలో తెలిపారు.

## ధన్వాడ నర్సరీని తనిఖీచేసిన అధికారులు

**ధన్వాడ, జనవరి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడ గుట్టల సమీపంలో ఉన్న నర్సరీని అధికారులుఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. డిఆర్డిఒ మొగులప్ప, ఎంపీడీఓ సాయి ప్రకాష్ ,ఏపీవో సిద్దేశ్వరులు నర్సరీని పరిశీలించారు. ప్రతిరోజు రెండు పూటలు మొక్కలకు నీళ్లు పోయాలని సీనియర్ మేటి ఆంజనేయులుకు సూచించారు. మొక్కలు ఎండిపోరాదని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ తప్పక ఉండాలన్నారు.

## సాఫ్ట్ బాల్ పోటీలకు గురుకులం విద్యార్థులు

**ధన్వాడ, జనవరి 28 ప్రభాతవార్త :** ఈనెల 29 నుండి 31 వరకు మెదక్ జిల్లా తూప్రాన్ ఒలంపిక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగే 68 వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమైక్య సాఫ్ట్‌బాల్ 14 సంవత్సరాలలోపు బాల, బాలికల పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు తరపున పాల్గొనుటకు స్థానికకొండాపూర్ గిరిజనగురుకులంలో చదువుతున్న సైదుల, కార్తీక్, అభిరామ్, వెంకటేష్ లు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రాజారాం తెలిపారు. వీరిఎంపికల పట్ల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, సాంబయ్యనాయక్, పీడి డాక్టర్ రామ్మోహన్, పీఈటి ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## బ్రహ్మోత్సవాల గోడ పత్రిక విడుదల

**ఉప్పునుంతల, జనవరి 28 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు గ్రామంలో వచ్చే నెల 4 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాల గోడపత్రికను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని వెలుతురు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గోడ పత్రికను విడుదల చేశారు. గోడ పత్రిక విడుదల చేసిన వారిలో మాజీ సర్పంచ్ రాగి వేణుగోపాల్ రెడ్డి, గున్నమోని లింగమయ్య యాదవ్, జంగారావు, భూషి రాజు మల్లయ్య, కుప్ప జంగయ్య, బాలరాజు, శ్రీనివాసులు, చెన్నయ్య ఆచారి, వెంకటేశ్వరరావు, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, వెంకటయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**మక్తల్, జనవరి 28 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని బురాన్‌గడ్డ వీధిలో నూతనంగా చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మక్తల్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, ఫయాజ్, శాలం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సొంత ఖర్చులతో రెండు హైమాస్ట్ లైట్లు వితరణ

**పెబ్బేరు జనవరి 28 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం అయ్యావారిపల్లి గ్రామంలో రాత్రి సమయంలో చీకటిగా ఉండటం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గమనించిన స్థానికులు వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా స్పందించిన వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి తన సొంత ఖర్చులతో గ్రామానికి రెండు హైమాస్ట్ లైట్లు వేయించారు. వెంటనే స్పందించి త్వరగా లైట్లు వేయించిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి గ్రామ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వేణుగోపాల్, లక్ష్మణ్‌నాయుడు, ఉప్పర్ శీను, కురుమూర్తి, తిరుపతి, బాలరాజు, భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్లు, ఎస్పీ జానకి

## మన్యంకొండ ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

అగ్నిమాపక సాధనాలతో సిద్ధంగా ఉండాలని, 5 కిలోమీటర్ల పరిధిలో మద్యపానాన్ని నిషేధించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని డిపిఓను ఆదేశించగా, ఉద్యాన శాఖ ద్వారా బ్రహ్మోత్సవాల సమయంలో దేవాలయం చుట్టుపక్కల పూల అలంకరణతో పాటు ,మొక్కల ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, దేవాలయం చైర్మన్, పాలక వర్గ సభ్యులు ఆవిష్కరించారు. సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, మన్నెంకొండ దేవస్థానం చైర్మన్ అలహరి మధుసూదన్, డిఆర్‌ఓ,కెవివి రవికుమార్ వివిధ శాఖల అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## డబుల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

కనెక్షన్లు, డ్రైనేజ్ వ్యవస్థ, సెప్టిక్ ట్యాంకులు, పరిసరాల శుభ్రత, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, మిగతా లబ్ధిదారులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయాలన్నారు. సమావేశానికి హాజరుకాని విద్యుత్ శాఖ, హౌసింగ్‌శాఖల అధికారులకు షోకాస్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ డిఈ లక్ష్మణ్, విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాస్, కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

### రైతు భరోసా పై హర్షం వ్యక్తం చేసిన ఈర్లదిన్నె గ్రామ రైతులు



**పెబ్బేరు జనవరి28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం, ఈర్లదిన్నె గ్రామంలో, ఏకకాలంలో గ్రామ రైతులు అందరికీ జనవరి 26 రోజు రైతు భరోసా 250 ఎకరాలకు కింద ఎకరాకు 6000 జమ అయ్యాయని అదే విధంగా రేషన్ కార్డులు 15,ఆత్మీయ భరోసా 9,ఇందిరమ్మ ఇండ్లు 71 ఏకకాలంలో అయినందుకు, సంతోషంతో, ఆనందోత్సాహాలతో, గ్రామ ప్రజలు, పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు టపాకులు కాల్చి, స్వీట్స్ పంచుకొని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ హర్షధ్వానాలు తెలియజేశారు. రైతు భరోసా అమలుపై అన్నదాతల్లో పెల్లుబికిన ఆనందంలో అన్నదాతలు కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి చిత్రపటాలకు అన్నదాతలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ నరసింహనాయుడు, మాజీ సర్పంచ్ రవీందర్, శివకుమార్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలస్వామి, రాజశేఖర్ రెడ్డి, నరేష్, వేణు, లక్ష్మణ్, జయన్న ఈర్లదిన్నె రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన రామయ్యకు సన్మానం



రామయ్యను సన్మానిస్తున్న ఎస్పి జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త:** 34 సంవత్సరాలుగా వివిధ పోలీసు స్టేషన్లలో విజయవంతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రమణయ్య, హోమ్‌గార్డ్ 47ని జిల్లా ఎస్పీ డి.జానకి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "రమణయ్య పోలీసు విభాగంలో ఎనలేని సేవలు అందించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, హోమ్‌గార్డ్స్ ఇన్చార్జి ఆర్ఐ రవి, ఆర్ఐ కృష్ణయ్య, ఆర్ఐ నగేష్, ఎస్‌బి ఎస్ఐ శ్రీనివాస్ రమణయ్యను అభినందించారు.

## దివ్యాంగులకు అన్ని శాఖల అధికారులు సహకరించాలి

**మద్దూర్, జనవరి 28 ప్రభాతవార్త:** మద్దూర్ పట్టణ కేంద్రంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అధికారుల సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు ప్రతి శాఖ నుంచి అందించే సహాయ సహకారం అందించాలని జిల్లా కమిట్‌మెంట్ ఈడి ఆయా శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేష్ గౌడ్, ఎంపీడీవో నరసింహారెడ్డి, ఆయా శాఖల బ్యాంకు మేనేజర్లు, మండల కోఆర్డినేటర్ రాధా, అయ్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక విడుదల

**ఉప్పునుంతల, జనవరి 28 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు గ్రామంలో వచ్చే నెల 4 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాల గోడపత్రికను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని వెలుతురు గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి అలివేలు మంగ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గోడ పత్రికను విడుదల చేశారు. గోడ పత్రిక విడుదల చేసిన వారిలో మాజీ సర్పంచ్ రాగి వేణుగోపాల్ రెడ్డి, గున్నమోని లింగమయ్య యాదవ్, జంగారావు, భూషి రాజు మల్లయ్య, కుష్క జంగయ్య, బాలరాజు, శ్రీనివాసులు, చెన్నయ్య ఆచారి, వెంకటేశ్వరరావు, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, వెంకటయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్డీవోకు ఘన సన్మానం

**నారాయణపేట టౌన్, జనవరి 28 ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డును అందుకున్న ఆర్డీవోను మంగళవారం ఆర్డీవో కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. అదేవిధంగా కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహేష్, టైపిస్ట్ గోవింద్ గణప,ఓస్ కథల్ అహ్మద్‌లను సన్మానించారు. సన్మానించిన వారిలో ఏవో జిమిల్, డిటి బాలరాజు, వెంకటేష్, తహసిల్దార్ డిటి జగన్, జూనియర్ అసిస్టెంట్ కాకర్ల భీమయ్య, మొన్నే అశోక్, రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్,అంజన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఆర్డీఓను సన్మానిస్తున్న దృశ్యం

# అర్హులైన రైతులకు రైతు భరోసా..

- సంక్షేమ పథకాల అమలులో అధికారులె కీలకం
- ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పారదర్శకత పాటించడం అత్యంత ముఖ్యం
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** అర్హులైన రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే రైతు భరోసా పథక లబ్ధిని చేరవేయడం ప్రధాన లక్ష్యమని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు."అనర్హులకు సంక్షేమ పథకాలు అందరాదని, అర్హులైన రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకం చేరాలని, రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో కలిసి సంక్షేమ పథకాల అమలు తీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చర్చించారు. వ్యవసాయానికి అనుకూలమైన భూములను మాత్రమే గుర్తించి, అర్హత గల రైతులకు పథకాలు అందేలా నిర్ధారించడంలో అధికారుల బృందాలు సమన్వయం చేసి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యం లేని భూములను తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో గుర్తించాలని స్పష్టం చేశారు.లే అవుట్లు, ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించిన భూములు, భూసేకరణకు వెళ్లిన భూములు వంటి వ్యవసాయానికి అనువుకాని భూభాగాలను 100 ఖచ్చితత్వంతో గుర్తించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియతో రైతుల సంక్షేమంసాధించడమే కాకుండా, పథకాలలో పారదర్శకతను మరియు న్యాయసమ్మతతను కాపాడటం కూడా ప్రభుత్వ ధ్యేయమని,నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి గ్రామంలో సర్వేలు చేపట్టాలని, అలాగే ప్రజా పాలనలో అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో హౌస్‌హోల్డ్ డేటాను ఖచ్చితంగా సేకరించడం ద్వారా అర్హులైన కుటుంబాలను గుర్తించాలి అని సూచించారు. ప్రజా పాలనలో అందిన అన్ని దరఖాస్తులను సమీక్షించి, నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన వారికి రేషన్ కార్డులను మంజూరు చేయడం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఆధార్, కుటుంబ సమాచారం,ఆదాయ వివరాల వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లను సరిచూడడం ద్వారాపారదర్శకతను నిర్ధారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ ప్రక్రియలో గ్రామస్థాయి సర్వేలు ప్రజల నమ్మకాన్ని పొందడంలో మరియు పథకాలకు అర్హులైన వారికి లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పారదర్శకత పాటించడం అత్యంత ముఖ్యం అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇందిరమ్మ ఇల్లు అనర్హులకు చేరకుండా చూడాల్సిన బాధ్యత పూర్తిగా అధికారులపైనే ఉంటుందని జిల్లా కలెక్టర్ సూచించారు. రెవెన్యూ సమస్యలతో పాటు ధరణి పెండింగ్ సమస్యలను ఆర్డీవోలు తాహసిల్దార్లు తమ పరిధిలో ఉన్న అన్నిపెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని, అనర్హులకు ఎవరికైనా సంక్షేమ పథకాల అందితే సంబంధిత అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి,కొల్లాపూర్, ఆర్డీవోలు కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

## మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రసాద్

**నవాబుపేట,జనవరి28 ప్రభాతవార్త:** మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులు,సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదాఅని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. వంటగదిని పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు పోషకాహారం విషయంలో అజాగ్రత్త వహించకూడదని తెలియజేశారు. కేజీబీవీ పాఠశాలకు క్రీడా ప్రాంగణం కాంపౌండ్ వాల్‌కోసం వెంటనేఎస్టిమేషన్ పంపాలని ఎంపీడీవోను తహసిల్దార్‌ను కోరారు.త్వరలోబాలికల క్రీడా స్థలానికి స్కూలుకు కాంపౌండ్‌వాల్ మంజూరు కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి తాసిల్దార్ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంను ఆయన పరిశీలించి ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గల చెత్తాచెదారాన్ని చూసి రోగులకు ఇబ్బంది లేకుండా హాస్పిటల్ పరిసరాలను శుభ్రంగాఉంచాలని రోగులు, బాలింతలు ఉండే గదులను రోజువారీగా శుభ్రంగా తుడిచి పెట్టాలని ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచడం లేదని డా. ప్రవీణ్ కుమార్‌కు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా దవాఖాన ప్రాంగణంలో గల అనవసరమైన చెత్త చెదారాన్ని తీసివేయాలని అదనంగా ఉన్న కొత్త భవనాలను సందర్శించిన ఆయన గదులు మొత్తం దుమ్ము ధూళితో అపరిశుభ్రంగా ఉన్నాయని వాటిని వెంటనే శుభ్రం చేయాలని ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు.పాత భవనాల గోడలను తీసేయాలని ఎంపీడీవో జయరాంకు నవాబుపేట పంచాయతీ కార్యదర్శి నరేష్‌కు తెలియజేశారు.



పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న కలెక్టర్

## జాతర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలి

### గట్టు తిమ్మప్ప జాతర మహోత్సవ సన్నాహక సమావేశంలో మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్ జనవరి 28 ప్రభాతవార్త:** మాద్వార్ గట్టు తిమ్మప్ప స్వామి వారి జాతర మహోత్సవము సంబందించిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు డా వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామ పెద్దలతో మాట్లాడుతూ ఆలయ ధర్మకర్తలతో, సంబంధిత అధికారులతో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లను గురించి చర్చించారు. జాతర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను అత్యంత వైభవంగా చేయాలన్నారు. అందుకుగాను నియోజకవర్గ శాసనసభ్యులుగా నా వంతు కృషి తప్పకుండా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సంతోష్ రెడ్డి గాంధ్ల రాములు, శ్రీనివాస్‌రెడ్డి,వడ్ల బాలరాజ్, విలేకరి బొంబాయి శంకర్, వడ్ల సత్యప్ప, వెంకటేష్‌గౌడ్, బాట విశ్వనాథ్, బుడబోయి బాలు, వడ్లశ్రీనివాస్, వడ్లనర్సింహ, జి.చంద్రప్ప,ప్యాట సవరప్ప, కర్నే తిమ్మయ్య,ఏరంకొల్ల లక్ష్మయ్య, గుడిసె ఎర్రతాయప్ప, కర్వా వెంకట్రారమణ అరికెరిసవరప్ప, ప్యాటయల్లప్ప, ప్యాట రాములు, రామకృష్ణ, కర్నెశ్రీను, బుడబోయి నరేష్, హోటల్ రాము, మండల ముఖ్య నాయకులు, గ్రామపెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

## పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు ఏర్పాటు చేయాలి

### మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి

**గద్వాల జనవరి28 ప్రభాతవార్త :** ప్రజల సౌకర్యార్థం కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మార్కెట్ చైర్మన్ డాక్టర్ రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ సంతోష్ కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజల చెంతకు పాలన ప్రజా సమస్యలు పరిష్కారం చేసే విధంగా ఉండాలన్నారు. గద్వాల నియోజకవర్గంలో ప్రస్తుతం 5మండలాలు వున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వము ప్రజల సౌకర్యార్థమై స్టేట్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ 2014లో సూచించిన విధంగా గద్వాల నియోజకవర్గంలో అదనంగా కొన్ని మండలాలు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని, అందులో బిజ్వారంను నూతన రెవెన్యూ మండలము ఏర్పాటు చేయాలని అయన వినతిపత్రం అందించారు. అధికార్లతో పాటుగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, డా.మల్లు రవి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంలో వారు కూడా జిల్లా కలెక్టర్‌కి పై విషయాన్ని తెలుపుతూ బిజ్వారం గ్రామమును నూతన రెవెన్యూ మండలముగా ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపమని యం.పి. లెటర్‌ను జిల్లా కలెక్టర్ కి సమర్పించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపమని కోరారు. బిజ్వారంతో పాటుగా నియోజకవర్గంలో గట్టు మండలములోని ఇందువాసి గ్రామాన్ని గద్వాల మండలములో రూరల్ మండలంగా పూడూరు గ్రామాన్ని,అర్బన్ మండలంగా గద్వాల టౌను రెవెన్యూ మండలాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇలా చేసినట్లయితే ప్రజలకు, రైతులకు సౌలభ్యంగా వుంటుందని కలెక్టర్‌కి విన్నవించగా వారు సాను కూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. చర్చలో భాగంగా సీనియర్ సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు కె.మోహన్‌రావు, రాష్ట్ర సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు ఎస్.పి. అచ్చన్న గౌడు సీతారాంరెడ్డి, పెద్దపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ చైర్మెన్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, మోహన్‌రావు

### అక్రమ సంబందం పెట్టుకున్నాడని వ్యక్తిపై దాడి

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నవాబుపేట, జనవరి 28 ప్రభాతవార్త:** అక్రమ సంబంధం పెట్టుకు న్నాడనే నేపంతో వ్యక్తిపై దాడి చేసి గాయాలపై చికిత్స పొందుతూ వ్యక్తి మరణించిన ఘటన నవాబుపేట మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మరికల్ గ్రామానికి చెందిన బైండ్ల నర్సింలు తండ్రి బైండ్ల రాములు (32) సంవత్సరాలు రోజువారీగా పొలం పనులకు వెళ్లిన నర్సింలును ఒంటరిగా ఉన్న సమయంలో పాత కక్షతో జోగు యాదయ్య భార్యతో అక్రమ సంబంధం ఉందనే నెపంతో అదే గ్రామానికి చెందిన జోగు యాదయ్య కుటుంబ సభ్యులు, జోగు నరసింహులు,జోగు బాలరాజ్, జోగు శ్రీను నలుగురు అన్నద మ్ములు కలిసి పొలం దగ్గర పనులు చేసుకుంటున్న బైండ్ల నరసింహులుపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచి ఆపై వారి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని భార్య బైండ్ల సునీత ఇంటి ముందర కూడా విచక్షణా రహితంగా కొట్టడంతో భార్యతో పాటు చుట్టుపక్కల వారు చూసి విడిపించారు. అప్పటికే తీవ్ర గాయాల పాయాలైన నర్సింలును 12:40 గంటలకు 108 అంబులెన్స్ లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంగళవారం అదే రోజు చికిత్స పొందుతూ దాదాపు మధ్యాహ్నం 2:30 గం.ల సమయంలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నల్లబెల్లం పట్టివేత

**నారాయణపేట టౌన్, జనవరి 28 ప్రభాతవార్త:** వాహనాల తనిఖీల్లో 11.40 క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టుకోవడం జరిగిందని సీఐ శివశంకర్,ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారంఅర్ధరాత్రిసమయంలో నారా యణ పేట జిల్లా కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గుర్మిట్కల్ నుండి మహబూబ్‌నగర్ వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో నల్ల బెల్లం ఉన్నట్లు గుర్తించి విచారించగా కిరణ్, రాజు అనే వ్యక్తులు గుర్మిట్కల్లోని హనుమాన్ నాయక్ అనే వ్యక్తి వద్ద బెల్లం కొనుగోలు చేసి మహబూబ్‌నగర్ తీసుకెళ్తున్నామని తెలిపారు. నల్లబెల్లం 38 బ్యాగ్‌లు, 11.40 క్వింటాళ్ల ఉండగా వాటి విలువ రూ.1,14,000 ఉంటుందని నల్ల బెల్లాన్ని అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహన డ్రైవర్ కిరణ్‌ను పట్టుకొగా రాజు పారిపోయాడని తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి బెల్లం అమ్మిన వ్యక్తి హనుమాన్ నాయక్, కిరణ్, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.



## లేఖలతో మాకు సంబంధం లేదు

### బీఆర్ఎస్ మండలం అధ్యక్షులు శ్రీశైలం యాదవ్

**రాజాపూర్, జనవరి 28 ప్రభాతవార్త :** మావోయిస్టుల పేరుతో వచ్చే లేఖలకు తమకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు శ్రీశైలంయాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టుల పేరుతో జడ్చర్లశాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డికి వచ్చిన లేఖలతో టిఆర్ఎస్ నాయకులకు సంబంధం ఉన్నట్లు రుజువు చేస్తే అలాంటి వారిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తామన్నారు. నిజాలు తెలుసుకోకుండా బీఆర్ఎస్ పార్టీపై ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆరోపణలు చేయడం మంచిది కాదని హితవు పలికారు.

## మద్దిగట్ల రవికుమార్‌రెడ్డికి ఎల్‌ఓసీ చెక్కు అందజేత

**భూత్పూర్,జనవరి 28,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన కుట్ల రవికుమార్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.ఎమ్మెల్యే సిఫార్సు మేరకు రవికుమార్‌రెడ్డికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రు. లక్షా 70వేల విలువ చేసే ఎల్‌ఓసీని మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి(జీఎంఆర్) భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి చేరుకుని కుట్ల రవికుమార్‌రెడ్డిని కలిసి ఎల్‌ఓసీ కాపీని అందజేశారు.

## నేటి భూత్పూర్ మున్సిపాలిటీ సమీక్షకు ఎమ్మెల్యే జీఎంఆర్ రాక

**భూత్పూర్,జనవరి 28,ప్రభాతవార్త:** మున్సిపాలిటీల పాలకవర్గ పదవీకాలం ముగిసిన తర్వాత జరుగుతున్న బుధవారం నాటి భూత్పూర్ మున్సిపాలిటీ తొలి సమీక్షా సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) హాజరౌతున్నారు. కౌన్సిల్ రద్దయిన తర్వాత జరుగుతున్న మొదటి సమీక్షా సమావేశం బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీ సమావేశ హాల్‌లో జరుగుతోంది.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఎంపిక పట్ల హర్షం

**అమరచింత జనవరి 28 ప్రభాతవార్త:** అమరచింత పట్టణానికి చెందిన సిపిఎం పార్టీకి చెందిన జాన్ వెస్లీ సంగారెడ్డిలో నాలుగు రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర మహాసభలో అమరచింత పట్టణానికి చెందిన జాన్ వెస్లీని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా మంగళవారం అమరచింత పట్టణంలోని సిపిఎం శ్రేణులు బాణాసంచ కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి వెంకటేష్,అజయ్, ఆర్ఎంరమేష్ ,రాఘవేంద్ర, శ్యాం సుందర్ ,బుచ్చన్న ,ఎస్ రాజు ఉన్నారు.

## మిమ్మల్ని నా ఆత్మీయులుగా భావిస్తున్నా..

మొదటి పేజీ తరువాయి భాగం..

ఉంటానని తెలిపారు. విద్య విషయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే బాధ్యత నాదేనని అందుకే మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని కూడా ఎక్కువ ఆసుపత్రులలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలను, తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వేహికిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రతా మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిషన్, వాసుదేవ్, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, ట్రాఫిక్ సిఐ భగవంత్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ఆర్టీఏ సభ్యులు సలీం, జిల్లా ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, నాయకులు అజ్మత్ అలి, లీడర్ రఘు, ఫయాజ్ పాల్గొన్నారు.

## కేసుల చేదనకు అన్ని కోణాలలో అన్వేషించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

అధికారులకు సూపెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులోఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో వనపర్తి డిఎస్పి,వెంకటేశ్వరరావు,డిసిఆర్బి డిఎస్పి,ఉమా మహేశ్వం రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, గోపాల్ రెడ్డి, వనపర్తి సిఐ, క్రిష్ణ, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూర్ సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, డిసిఆర్బి సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.